సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 3 । ఆగస్టు । 2025



చిరంజీవులుగా జీవిద్దాం..
మనిషి మరణించిన తర్వాత మట్టిగానో.. బూడిదగానో మారే అవయవాలను దానం చేస్తే మరొకరికి ప్రాణం పోసినట్లే.
- 8లో▸



నైపుణ్యంతోనే ప్రజలకు న్యాయం
- 8లో▸
పోలీసులు విధుల్లో నైపుణ్యం ప్రదర్శించినప్పుడే ప్రజలకు సరైన న్యాయం లభిస్తుందని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.2°/26.3°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నీతి ఆయోగ్‌లో జిల్లాకు రెండో స్థానం



భూపాలపల్లి: నీతి ఆయోగ్‌లో జిల్లా రెండో స్థానం దక్కించుకుంది. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆస్పిరేషనల్ జిల్లాలు, ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన జిల్లాలు, మండలాలను ఎంపిక చేసి శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో అవార్డులను ప్రదానం చేశారు. సంపూర్ణత అభియాన్ విభాగంలో మెరుగైన ఫలితాలు సాధించి జిల్లా రెండవ స్థానం దక్కించుకోగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా కలెక్టర్ రాహుల్ శర్మ అవార్డు అందుకున్నారు.

స్ట్రాంగ్ రూం ఏర్పాటుకు ప్రతిపాదనలు



కాటారం: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి కాటారం మండల కేంద్రంలో ఈవీఎంలు భద్రపర్చడం కోసం స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని గదులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. పరిసరాలు, గదుల సంఖ్య, సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యుత్, ఇతరత్రా సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట ఎంపీడీఓ బాబు, పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్ ఉన్నారు.

సూపరింటెండెంట్‌గా ఉమేశ్వరి



భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి చీఫ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా డి.ఉమేశ్వరి నియమితులయ్యారు. భద్రాది కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఉమేశ్వరికి చీఫ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి లభించింది. దీంతో బదిలీపై భూపాలపల్లి వచ్చి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నర్సింగ్ సిబ్బంది ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్స్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది కమిటీ ఎన్నిక



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపాలిటీ కార్యాలయ సిబ్బంది, కార్మికుల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా సంకటి సదయ్య, ఉపాధ్యక్షుడిగా కల్లెపల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా నగవత్ రాజేందర్ (బద్రి), కోశాధికారిగా రాపర్తి జంపయ్య, గౌరవ అధ్యక్షులుగా బండారి బాబు, నస్నపు ప్రకాశ్, ముఖ్య సలహాదారులుగా ఓరుగంటి రాజేందర్, జనగాని వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులుగా అల్లూరి మంజుల, ఏకు సునీత, అంతడుగుల సతీష్‌లకు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

'అదనపు రుసుము వసూలు చేస్తే చర్యలు'

కాటారం: మీ సేవ ద్వారా రుసుము అదనంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని ఈడీఎం శ్రీకాంత్ హెచ్చరించారు. మండలకేంద్రంలోని మీ సేవ కేంద్రాలను శనివారం ఈడీఎం తనిఖీ చేశారు. మీ సేవల్లో అందుబాటులో ఉన్న సేవలు, సౌకర్యాలపై ఆరాతీశారు. రికార్డులను పరిశీలించారు. పౌర సేవలకు సంబంధించిన ధరల పట్టికను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలను నిరంతరంగా అందించాలని సూచించారు. మీ సేవకు వచ్చే ప్రజల పట్ల మర్యాదగా నడుచుకోవాలని వారి సమయం వృథా చేయవద్దని ఈడీఎం పేర్కొన్నారు.

కల్మషం లేనిది స్నేహబంధం




- ఇద్దరికి మించి స్నేహితులు అవసరం
- అమ్మానాన్న తరువాత ఫ్రెండ్‌కే ప్రాధాన్యం
- ఉమ్మడి వరంగల్ జిల్లా యువత మనోగతం

స్నేహం అంటే మనుషుల్ని కలిపే వారధి. కష్టసుఖాలను పంచుకునే ఓ అనుభూతి. కష్టం వచ్చిందంటే నేనున్నానంటూ 'చేయి' అందించే ఓ రూపం.. ప్రపంచంలో ప్రతీ బంధానికి ప్రత్యేకత ఉంటుంది. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తారు..బంధువులు సహజంగా లభిస్తారు.. కానీ స్నేహితులు మాత్రం మనం మన చేతిగా ఎంచుకునే బంధం. అలాంటి అపూర్వమైన అనుబంధాన్ని గుర్తుచేసుకునే రోజు స్నేహితుల దినోత్సవం. ఈ నేపథ్యంలో స్నేహబంధంపై ఉమ్మడి వరంగల్ జిల్లా యువత మనోగతంపై సాక్షి సర్వే నిర్వహించింది. ఇప్పటికీ, ఎప్పటికీ కల్మషం లేనిది స్నేహబంధమని చెప్పుకొచ్చారు. ప్రతీ ఒక్కరికి జీవితంలో ఇద్దరికంటే ఎక్కువ స్నేహితులుండాలని, అప్పుడే ఏదైనా ఆపద వస్తే అండగా ఉంటారని చెప్పారు.

\- సాక్షి నెట్‌వర్క్

సర్వే శాంపిల్స్ 120 (ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆరు జిల్లాలు.. ప్రతీ జిల్లానుంచి 20మంది చొప్పున)
(10 మంది యువకులు, 10మంది యువతులు)



కలిసి నడుస్తున్న బాల్యమిత్రులు..



బాల్యస్నేహితులు నర్సింహులు, జలంధర్‌రెడ్డి

దేవరుప్పుల: బడికెళ్లే వయసు నుంచి బతుకుదెరువు వరకు కలిసే నడుస్తున్నారు జనగామ జిల్లా దేవరుప్పుల మండలం నీర్మాలకు చెందిన కొత్త జలంధర్‌రెడ్డి, కూతాటి నర్సింహులు. వీరు పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. ఉన్నత చదువులు చదవక పోయినా ఆ ప్రాంత వామపక్ష భావజాలంతో ఇరువురు పలు ప్రజాస్వామిక ఉద్యమాల్లో చురుగ్గా పనిచేశారు. రాజకీయ, సామాజిక ఉద్యమాల్లో రాణిస్తూ ఆఖరికి బతుకుదెరువు కోసం సైతం ఇరువురు వ్యాపారంలోనూ కలిసే పనిచేస్తున్నారు. ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆడపిల్లలకు ఆర్థిక చేయూత



స్నేహితుడి కుమార్తెకు ఆర్థిక సహకారం అందిస్తున్న స్నేహితులు (ఫైల్)

ఖానాపురం: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 1996–97లో విద్యార్థులు పదో తరగతి పూర్తి చేసుకున్నారు. వీరంతా మూడేళ్ల క్రితం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్న సమయంలో వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేసుకున్నారు. వీరితో పాటే 6 నుంచి 9వ తరగతి చదివిన వారిని సైతం ఇదే గ్రూప్‌లో యాడ్ చేసుకున్నారు. ప్రస్తుతం సుమారు 50 మందితో గ్రూప్ సాగుతోంది. గ్రూపులో ఎవరికి ఏ కష్టమొచ్చినా తామున్నామనే భరోసాను కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 14 మంది స్నేహితుల కుమార్తెల వివాహాలకు ఆర్థిక సాయం అందించారు. వివాహ సమయాల్లో కలుసుకుని ఆనందంగా గడుపుతున్నారు.



నల్లబెల్లి: స్నేహితుల దినోత్సవం ముందస్తు వేడుకల్లో భాగంగా నల్లబెల్లి మండల కేంద్రంలోని శ్రీవిద్యానికేతన్ హైస్కూల్‌లో శనివారం దోస్త్ అక్షరాల ఆకారంలో కూర్చున్న విద్యార్థులు



గాయపడిన అజహర్‌ను ఆస్పత్రికి తీసుకెళ్తున్న స్నేహితులు(ఫైల్)

పాతికేళ్ల అనుబంధం

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన ముగ్గురు స్నేహితులు కత్తెర శ్రీనివాస్, గుంత రమేశ్, మహ్మద్ అజహర్‌పాషా 1995–96లో ఏటూరునాగారం జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుకున్నారు. అప్పటి నుంచి ముగ్గురిలో ఎవరికి ఏ కష్టం వచ్చినా మేమున్నామంటూ కలిసే నడుస్తున్నారు. ఇటీవల అజహర్‌కు కారు ప్రమాదం జరగగా కత్తెర శ్రీను, గుంత రమేశ్ అన్నీ తామై చూసుకున్నారు. తమ ప్రాణాలు పోయేదాకా స్నేహం కొనసాగుతుందని వారు చెబుతున్నారు.

దిల్‌ఖుష్ దోస్తానా

- కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న స్నేహితులు
- ఆర్థికంగా ఆదుకుంటున్న పూర్వ విద్యార్థులు
- ఆదర్శంగా నిలుస్తున్న ఉమ్మడి జిల్లా దోస్తులు

నేడు ఫ్రెండ్‌షిప్ డే



లింగభేదాలకు అతీతం.. కులమతాలకు వ్యతిరేకం.. కష్టాల్లో గుండె నిబ్బరం. రంగుల కలలను రంగరించే ప్రత్యేక లోకం. అదే స్నేహ బంధం దృగంతాలను చుట్టి రావాలన్నా.. అంబరాన్ని అందుకోవాలన్నా.. సందర్భమేదైనా జిందగీలో దోస్తానా అనేది ఉంటే.. దిల్.. జిగేల్ అనాల్సిందే! అలాంటి స్నేహ మాధుర్యానికి నేడు (ఆదివారం) స్నేహితుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' అక్షర రూపం ఇచ్చింది.

స్నేహితం.. సేవే అభిమతం



కుమార్తె ఫీజు కోసం మిత్రుడు నాగేశ్వరరావు దంపతులకు ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు(ఫైల్)

తొర్రూరు: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984–85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆపదలో స్నేహితులకు ఆర్థిక చేయూతనిస్తూ ఆసరాగా నిలుస్తున్నారు. తీవ్ర అనారోగ్యం బారిన పడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మిత్రుడు చిట్ల సంపత్‌ను బతికించాలని రూ.1.3 లక్షలు సమీకరించి చికిత్స అందించారు. కంఠాయపాలెం గ్రామానికి చెందిన ఆర్‌ఎన్ చారి అనారోగ్యం బారిన పడి ఆర్థికంగా చితికిపోగా.. గుర్తించిన మిత్రులు రూ.50 వేలు జమ చేసి అందించారు. పదో తరగతి మిత్రుడు నాగేశ్వరావు ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తుండగా.. బస్సు ప్రమాదంలో అతడి కాళ్లు విరిగాయి. ఆరు నెలలు డ్యూటీ లేకుండా ఇంట్లోనే ఉండడంతో అతడి కూతురు చదువుకు ఫీజు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో మేమున్నామంటూ సహచర పదో తరగతి మిత్రులు రూ.70 వేలు అందించారు.



స్నేహితుల సంఘం!



కోటమైసమ్మ ఆలయం వద్ద గొర్రెపోతులతో సంఘం సభ్యులు (ఫైల్)

గీసుకొండ: గ్రేటర్ వరంగల్‌లోని 16వ డివిజన్ ధర్మారంలోని కోట మైసమ్మ తల్లి పరపతి సంఘం (స్నేహితుల సంఘం) ఆదర్శంగా నిలుస్తోంది. 2014 ఆగస్టు 15న తొమ్మిది మంది స్నేహితులు కలిసి ఏర్పాటు చేసిన సంఘంలో ప్రస్తుతం 24 మంది సభ్యులున్నారు. రూ. 50 లక్షల టర్నోవర్‌తో సంఘం లావాదేవీలు నిర్వహిస్తోంది. అవసరం ఉన్నసభ్యులకు రూ.0.5 వడ్డీతో రుణాలిస్తున్నారు. సంఘ సభ్యులెవరైనా మరణిస్తే వారి కుటుంబానికి రూ.లక్ష సాయం అందిస్తున్నారు. ఏటా ఫ్రెండ్ షిప్ డే రోజున సంఘ వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. కోటమైసమ్మ తల్లికి గొర్రెలను బలిచ్చి విందు చేసుకుంటూ ఆనందంగా గడుపుతున్నారు.

ఆడపిల్లల్లో స్నేహితుడిని చూసుకుంటూ..



శివాని ఫీజు కడుతున్న బాల్యమిత్రులు(ఫైల్)

కేసముద్రం: బాల్యమిత్రుడు మృతి చెందాడు. అతని ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారు. ఆ ఆడబిడ్డల్లో స్నేహితుడిని చూసుకుంటున్నారు కేసముద్రం మున్సిపల్ కేంద్రానికి చెందిన ఎస్‌వీవీ హైస్కూల్‌కు చెందిన 1996–97 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు. మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన గాండ్ల అశోక్‌కు ఇద్దరు కుమార్తెలు. మొదటి భార్యకు కూతురు పుట్టగానే ఆమె మృతిచెందింది. ఆతర్వాత రెండో వివాహం చేసుకున్నాడు. కాగా.. రెండో భార్యకు మరో కూతురు జన్మించగానే అశోక్ చనిపోయాడు. తండ్రిని కోల్పోయిన ఆ ఇద్దరు చిన్నారుల పరిస్థితి దయనీయంగా మారింది. స్పందించిన ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆ ఇద్దరు ఆడపిల్లల పేరుమీద సుకన్య సమృద్ధి యోజన కింద ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఏటా రూ.45వేల ఫీజు చెల్లిస్తూ పెద్ద కూతురు శివానిని(6వ తరగతి) నర్సంపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నారు. వారు చదువుకున్నంత కాలం తాము చదివిస్తామని బాల్యమిత్రులు చెబుతున్నారు.

బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్

హన్మకొండ: సమాజానికి సేవ చేయాలనే సదుద్దేశంతో 10 మందితో మొదలైంది బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్. ప్రస్తుతం వేయి మందితో నడుస్తోంది. ఆర్థిక సమస్య కారణంగా ఎవరూ చదువు మధ్యలోనే ఆపేయవద్దనే లక్ష్యంతో ఈ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు ప్రభుత్వ ఉపాధ్యాయుడు పులి దేవేందర్, డిప్యూటీ తహసీల్దార్ పతంగి భాస్కర్‌తో పాటు మరికొంత మంది మిత్రులు. 2020లో మొదలైన ఈ ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పేద విద్యార్థులకు ఆర్థికసాయం, పాలిసెట్ బుక్స్ పంపిణీ, పోటీ పరీక్షల పుస్తకాలు, మెటీరియల్ అందజేత, తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ఆర్థిక సహాయం. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా కల్పిస్తూ వారికి ఆర్థిక చేయూతనందిస్తూ ముందుకు సాగుతోంది.



కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం అందిస్తున్న బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు(ఫైల్)

సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



తహసీల్దార్ కార్యాలయం కంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మల్హర్: రైతులకు సౌకర్యాలు, గౌరవం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం మండలంలోని తాడిచర్ల గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో ఆధునీకరణ చేసిన సహకార సంఘ కార్యాలయం, గోదాం భవనం, రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనం రూ.7.80 లక్షలతో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి రైతు వేదిక వరకు నిర్మించనున్న సీసీ రోడ్డును, రూ.3.5 లక్షలతో పీఏసీఎస్ ఆర్నిగేట్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. రూ.12 లక్షలతో వ్యయంతో నిర్మించనున్న తహసీల్దార్ కంపౌండ్ వాల్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. సహకార సంఘం కార్యాలయం ఏర్పాటు ద్వారా గ్రామీణ ప్రాంత రైతులకు బ్యాంకు సేవలు, వ్యవసాయ రుణాల మంజూరు సులభతరం అవుతుందన్నారు. తాడిచర్ల జూనియర్ కాలేజీలో చదువుకున్న విద్యార్థులు ప్రధానంగా బాలికలు పట్టణాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించడం అభినందనీయమన్నారు. అధునాతన హంగులతో గ్రంథాలయం ఏర్పాటు ద్వారా విద్యార్థులకు, ప్రజలకు పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ వనరులు అందుబాటులో ఉంచాలని సూచించారు. పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్ (ఇండ్ల సేకరణ) సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, సింగిల్ విండో చైర్మన్ ఇప్ప మొండయ్య, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ అధికారి బాబూరావు, మహాదేవపూర్ ఏడీఏ శ్రీవ్యాల్, తహసీల్దార్ రవి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం

కాళేశ్వరం: మహదేవపూర్ జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాల విద్యార్థులు మాడిగ అక్షిత, పందుల గణేష్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. హనుమకొండ జేఎన్ స్టేడియంలో ఈనెల 3, 4తేదీల్లో జరగనున్న 11 తెలంగాణ స్టేట్ జూనియర్, సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్‌ఎం సరిత, పీడీ పూర్ణిమ తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

మల్హర్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి అందిస్తున్న వైద్యం, మందుల లభ్యత, సిబ్బంది హాజరు, వైద్య సేవల పని తీరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందుల స్టాక్, శానిటేషన్ పరిస్థితులు, రికార్డుల నిర్వహణ, ఓపీ రిజిస్టర్ తదితర అంశాలను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రి సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసుల విచారణలో పోలీసు జాగిలాలు కీలకం

- ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: పోలీసు శాఖలో వివిధ కేసుల విచారణలో పోలీసు జాగిలాల సేవలు కీలకమని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు జాగిలాల కోసం నూతన గదులను ఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో పోలీసు జాగిలాల సౌకర్యార్థం నూతనంగా నాలుగు గదులను ప్రారంభించినట్లు తెలిపారు. పేలుడు పదార్థాలు కనుక్కోవడం, హత్య కేసులను ఛేదించడం, మాదక ద్రవ్యాలు, దొంగలను పసిగట్టడం, వివిధ కేసుల విచారణలో పోలీసు జాగిలాల సేవలు వినియోగిస్తామన్నారు. జాగిలాలకు ప్రతిరోజు వ్యాయామం చేయించడంతో పాటు, మెనూ ప్రకారం ఆహారం అందిస్తూ ఆరోగ్యవంతంగా ఉండేలా చూడాలని డాగ్ స్క్వాడ్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, డీఎస్పీలు సంపత్‌రావు, నారాయణనాయక్, ఇన్‌స్పెక్టర్లు నరేష్, నగేష్, కిరణ్, రత్నం పాల్గొన్నారు.



జాగిలాల గదులను ప్రారంభిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

ఎన్‌సీసీతో క్రమశిక్షణ


● కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామదురై



శిక్షణ పొందిన ఎన్‌సీసీ కేడెట్లతో ఎన్‌సీసీ ఆఫీసర్లు తదితరులు

కేయూ క్యాంపస్: ఎన్‌సీసీతో క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామదురై అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో గత నెల 24 నుంచి నిర్వహిస్తున్న ఎన్‌సీసీ పదో తెలంగాణ బెటాలియన్ వరంగల్ గ్రూప్ క్యాంపు శనివారం సాయంత్రం ముగిసింది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు. న్యూఢిల్లీలో వచ్చే ఏడాది జనవరి 26న రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొనేందుకు ఇక్కడ ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ ఇచ్చారు. ఇందులో 120 మందిని ఎంపిక చేశారు. అందులో డ్రిల్, బెస్ట్ క్యాడెట్స్, కల్చరల్, ఫ్లాగ్‌ఏరియా విభాగాల్లో ఎంపిక చేశారు.కార్యక్రమంలో క్యాంపు ఆడమ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రవిసునారే, కెప్టెన్ డాక్టర్ పి.సతీశ్, కెప్టెన్ డాక్టర్ ఎం. సదానందం, సుబేదారిమేజర్ జైరామ్‌సింగ్, రవీందర్, సందీప్, రాధాకృష్ణ, రాజమాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

తెగిన చెక్‌డ్యాంలు.. వృథాగా పోతున్న నీరు



జయపురం చెక్‌డ్యాం తెగడంతో వృథాగా పోతున్న నీరు

నర్సింహులపేట : మండలంలోని జయపురం, ముంగిమడుగు శివారులోని ఆకేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలు తెగిపోయాయి. ఈ చెక్‌డ్యాంలు తెగి ఏడాది దాటుతున్నా మరమ్మతు చేయకపోవడంతో నీరు వృథాగా పోతోంది. వీటితో పాటు కొమ్ములవంచలో ఆకేరు వాగుపై నిర్మించిన ఆనకట్ట గేట్ల లీకేజీతో నీరు నిల్వకుండా వాగులోకి వెళ్తోంది. ఫలితంగా వాగు చుట్టు ఉన్న బొజ్జన్నపేట, రామన్నగూడెం, జయపురం, ముంగిమడుగు, కొమ్ములవంచ గ్రామాల్లో సుమారు 900 నుంచి 1000 ఎకరాల్లో సాగుకు నీరులేక రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. కాగా, తెగిన చెక్‌డ్యాంలపై ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

అప్పల బాధతో ఆత్మహత్యాయత్నం..

● చికిత్స పొందుతున్న కూలీ మృతి

గీసుకొండ: అప్పుల బాధతో ఆత్మహత్యాయ్నతానికి పాల్పడిన ఓ కూలీ.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన గీసుకొండలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చినగారి భాస్కర్(43) కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం ఇంటి నిర్మాణం చేపట్టగా అప్పు అయ్యింది. దీంతో అప్పు తీర్చలేని స్థితితోపాటు కుటుంబాన్ని పోషించలేక గత నెల 25న గడ్డి మందు తాగగా వరంగల్ ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

చిరంజీవులుగా జీవిద్దాం..


మరణిస్తూ మరొకరికి ప్రాణంపోద్దాం..

● అవయవదానంపై సమాజంలో పెరుగుతున్న అవగాహన

● నేడు జాతీయ అవయవదాన దినోత్సవం



మహబూబాబాద్ వైద్య కళాశాలకు పార్థివదేహం దానం చేయగా సెల్యూట్ చేస్తున్న సంఘ సభ్యులు, బంధువులు (ఫైల్)



వెంకటాపురం(ఎం) : మనిషి మరణించిన తర్వాత మట్టిగానో.. బూడిదగానో మారే అవయవాలను దానం చేస్తే మరొకరికి ప్రాణం పోసినట్లే. అంతేకాకుండా అవయవాలను దానం చేసిన మనిషి కూడా చిరంజీవిగా జీవించినట్లే. చావుకు సమీపంలో ఉన్న వ్యక్తిని బతికించగల గొప్ప కార్యమిది. ఈ క్రమంలో అవయదానంపై సమాజంలో ఇప్పుడిప్పుడే అవగాహన పెరుగుతోంది. అవయవదానం కొత్తేమీ కాదు. కన్నప్ప సాక్షాత్తు ఈశ్వరుడికే తన కన్ను దానం చేశాడు. మన మధ్య కూడా అలాంటి దానకర్ణులు ఉన్నారు. విలువైన అవయవాలను మట్టిపాలు చేసే బదులు ఇంకొకరికి దానం చేస్తే వారి ఆయుష్షు పెంచిన వారమవుతామని వైద్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఆయువు పోయినా.. అవయదానంతో ఊపిరిపోద్దాం.. రండి.. అవయదానం చేద్దాం.. మరణించినా మరో వ్యక్తిలో జీవించే ఉందాం.. అంటూ అవయవాల దానంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలు ఏటా ఆగస్టు 3న జాతీయ అవయవదాన దినోత్సవం నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

చనిపోయిన తర్వాత దానం చేసే అవయవాలు..

మనిషి మరణానంతరం కళ్లు, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, లివర్, జీర్ణ వ్యవస్థలోని ప్యాంక్రియాస్, పేగులు దానం చేయొచ్చు. అయితే రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి తలకు రక్త సరఫరా నిలిచిపోయిన, తీవ్రంగా గాయపడిన వారు బ్రెయిన్ డెడ్ అని నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే అవయవాలను సేకరిస్తారు.

ఎనిమిది మందికి పునర్జన్మ..

చనిపోయిన వ్యక్తి నుంచి ఎనిమిది మందికి అవయవాలను దానం చేసే వీలుంది. గుండె, మూత్రపిండాలు, కళ్లు, పాంక్రియాస్, ఊపిరితిత్తులు, కాలేయం, పేగులు, ఎముకల్లోని మజ్జ, ఇతరులకు మార్పిడి చేసే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. కిడ్నీ, కాలేయం, ఎముక మజ్జ బతికుండగానే దానం చేయొచ్చని పేర్కొంటున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో..

తెలంగాణ నేత్ర శరీర అవయవదానం సంస్థ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు 228 మంది నుంచి కళ్లు, 158 పార్థివదేహాలు, 126 మంది నుంచి అవయవాలు సేకరించారు. 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ సంస్థ ద్వారా నిర్వాహకులు ప్రజలకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో గుర్తింపు పొందిన ఈ సంస్థ దేశంలోనే ఆర్గాన్ డోనేషన్‌లో రెండో స్థానంలో ఉంది.

నలుగురికి పునర్జన్మ..



మా నాన్న భద్రయ్య గతేడాది అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించాం. చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయ్యాడు. ఆయన అవయవాలను దానం చేస్తే పలువురికి పునర్జన్మ కల్పించొచ్చని జీవన్ ధాన్ కోఆర్డినేటర్లు కౌన్సెలింగ్ ఇవ్వడంతో కుటుంబ సభ్యులందరం ఒప్పుకున్నాం. గుండె, కిడ్నీలు, లివర్, కళ్లు దానం చేశాం. మా నాన్న మరణించినా అవయవాలదానంతో మరొకరిలో బతికున్నాడని మాకు ఆనందం కలిగింది.

– కుమ్మరి సాగర్, వెంకటాపురం(ఎం)

మరణించినా బతికే ఉందాం..



అవయవాలు దానం చేసి మరణించినా మరొకరిలో బతికే ఉందాం. పార్థివదేహాన్ని కాల్చితే బూడిద అవుతుంది. పాతిపెడితే మట్టి అవుతుంది. కానీ అవయవాలను మరొకరికి దానం చేస్తే వారికి పునర్జన్మ ఇచ్చినట్లు అవుతుంది. కళ్లు లేక లక్షలాదిమంది ప్రపంచాన్ని చూడలేకపోతున్నారు. అలాంటి వారికి కళ్లను దానం చేస్తే వారికి పునర్జన్మ ఇచ్చినట్లే. అవయవదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ పరికిపండ్ల అశోక్, తెలంగాణ నేత్ర శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు

బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

● రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మల్హర్: తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బీసీ రిజర్వేషన్ల పెంపు తీర్మానాన్ని ఆమోదించి కేంద్రం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని తాడిచర్ల సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం అడ్డుపడుతుందని ఆరోపించారు. అదేవిధంగా బీసీ రిజర్వేషన్ కోసం కేబినెట్‌లో నిర్ణయించి ఆర్డినెన్స్ తీసుకొచ్చి గవర్నర్‌కు పంపామని, కానీ గవర్నర్ నుంచి ఎలాంటి ఆమోదం లభించలేదన్నారు. బీసీ బిల్లు, ఆర్డినెన్స్ ఆమోదంలో జాప్యానికి నిరసనగా 5, 6, 7 తేదీల్లో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించామని వెల్లడించారు. 10 సంవత్సరాలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ అప్పుడు బీసీ రిజర్వేషన్ చట్టం చేయలేదన్నారు. ఇప్పుడు మాత్రం మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసమే నిందారోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, తాడిచర్ల గ్రామానికి చెందిన దండు రమేశ్‌ను ఎస్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నియమించడం దళితులకు దక్కిన గౌరవమని వెల్లడించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఇప్ప మొండయ్య, మాజీ ఎంపీపీ మల్హల్‌రావు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ మల్క సూర్యప్రకాశ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న భూ తగాదాలు..

● మూడు ఇంచుల స్లాబ్ ఇంటి నిర్మాణంలో ఘర్షణ

● పరస్పర దాడులు.. పది మందికి తీవ్రగాయాలు

● సుతారి తండాలో ఘటన



పాలకుర్తి సీఐ కార్యాలయం ఎదుట క్షతగాత్రులు

పాలకుర్తి టౌన్ : మూడు ఇంచుల స్లాబ్ ఇంటి నిర్మాణం వద్ద మొదలైన మాటలు ఘర్షణకు దారి తీశాయి. దాయాదులు పరస్పరం దాడులు చేసుకోవడంతో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి జనగామ జిల్లా కొడకండ్ల మండలం మొండ్రాయి శివారు సుతారి తండాలో జరిగిన భూ దగాదాలు ఉద్రిక్తతకు దారి తీశాయి. బాధితుల కథనం ప్రకారం.. తండాకు చెందిన వాంకుడోతు సక్రు, రంగమ్మ దంపతులు తమ ఇంటి నిర్మాణం కొనసాగిస్తుండగా అదే తండాకు చెందిన దాయాదులు బాలు, రామోజీ, శ్రీకాంత్, సంతోష్, యాకు, భాస్కర్ కర్రలు, గొడ్డళ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో దంపతులతో సహా తమ ఐదుగురు కుమార్తెలు, వారి పిల్లలు మొత్తం పదిమంది తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఈ ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా పోలీసులు స్పందించపోవడంతో బాధితులు అదే రోజు రాత్రి పాలకుర్తి సీఐ కార్యాలయానికి వచ్చారు. అయితే సీఐ అందుబాటులో లేకపోవడంతో పాలకుర్తి ఎస్సై పవన్‌కుమార్.. కొడకండ్ల ఎస్సై రాజుతో మాట్లాడి పంపించారు. కాగా, కొడకండ్ల ఎస్సై రాజు తమను పట్టించుకోకుండా దురుసుగా ప్రవర్తించారని, దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని బాధితులు డిమాండ్ చేశారు.

డ్రగ్స్‌పై అవగాహనకే ప్రహరీ క్లబ్‌లు

● హనుమకొండ డీఈఓ వాసంతి



మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

విద్యారణ్యపురి: రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకే ప్రభుత్వం ప్రహరీక్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు హనుమకొండ డీఈఓ డి.వాసంతి తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లకు, ప్రధానోపాధ్యాయులకు ప్రహరీక్లబ్‌ల ఏర్పాటు, మాదద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడానికి భీమారంలోని స్కిల్‌స్టోర్క్ స్కూల్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో డీఈఓ మాట్లాడారు..పాఠశాల హెచ్‌ఎం చైర్మన్‌గా, ఓ ఉపాధ్యాయుడు వైస్‌చైర్మన్‌గా, ప్రతీ తరగతి నుంచి ఒక బాలుడు, ఒక బాలిక చొప్పున ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రహరీ క్లబ్ కమిటీ ఉంటుందన్నారు. యాంటీడ్రగ్స్ నార్కొటిక్స్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. పాఠశాలల సమీపంలో ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తే వెంటనే 1908కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్, జిల్లా కమ్యూనిటీ మొబలైజింగ్ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, ఆచార్యులు రవికుమార్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో స్పాట్ అడ్మిషన్లు

హనుమకొండ జిల్లాలోని కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లకు 4న అవకాశం కల్పించామని డీఈఓ వాసంతి తెలిపారు. ముల్కనూరు కేజీబీవీలో 22, ధర్మసాగర్ సీఈసీలో 15, ఎల్కతుర్తిలో 48, హసన్‌పర్తి సీఈసీలో 14, శాయంపేట బీపీసీలో 20, వేలేరు కేజీబీవీలో 33 సీట్లకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ముల్కనూరు మోడల్ స్కూల్‌లో 158, కళాశాలలో 49, ఎల్కతుర్తి మోడల్ స్కూల్‌లో 234, కళాశాలలో 47, కమలాపూర్ మోడల్ స్కూల్‌లో 311 సీట్లు, కళాశాలలో 18 సీట్లు భర్తీకి అవకాశం కల్పించామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు మార్కుల జాబితాలు, ఆధార్ కార్డు, టీసీతో సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాళ్లను కలిసి అడ్మిషన్లు పొందాలన్నారు.

నైపుణ్యంతోనే ప్రజలకు న్యాయం

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

● కఠోర సాధనతోనే విజయాలు

● డీజీపీ డాక్టర్ జితేందర్

● ముగిసిన రాష్ట్ర స్థాయి 2వ పోలీస్ డ్యూటీమీట్–2025



మాట్లాడుతున్న డీజీపీ జితేందర్, వేదికపై జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా, సీపీ సన్‌ప్రీత్ సింగ్ తదితరులు




మాట్లాడుతున్న జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా, వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్



మొక్కనాటి నీరు పోస్తున్న డీజీపీ జితేందర్

మామునూరు: పోలీస్ అధికారులు విధుల్లో ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించినప్పుడే ప్రజలకు సరైన న్యాయం లభిస్తుందని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. వరంగల్ మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల పరేడ్ గ్రౌండ్‌లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సీపీ సన్ ప్రీత్‌సింగ్ పర్యవేక్షణలో మూడు రోజులుగా నిర్వహించిన తెలంగాణ పోలీస్ 2వ డ్యూటీ మీట్–2025 శనివారం ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు డీజీపీ జితేందర్, జైళ్ల శాఖ డీజీపీ డాక్టర్ సౌమ్యమిశ్రా ముఖ్యఅతిథులుగా హాజరై డ్యూటీ మీట్ విజేతలకు ట్రోఫీలు, షీల్డులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో అత్యధిక మెడల్స్ సాధించిన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించగా డీజీపీ ట్రోఫీ అందజేశారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ రాష్ట్ర పోలీసు సిబ్బంది ఇదే స్ఫూర్తితో రాబోయే జాతీయ స్థాయి డ్యూటీ మీట్‌కు సిద్ధం కావాలని, లక్ష్యం ఎంచుకుని కఠోర సాధన చేసి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. పోలీస్ అధికారులు క్రమ శిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం జైళ్ల శాఖ డీజీపీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ రెండోసారి వరంగల్‌లో రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ ముగింపు కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందన్నారు. తాను ఎస్పీగా ఉన్న సమయంలో నిర్వహించిన డ్యూటీ మీట్ గుర్తుకు వస్తోందని పేర్కొన్నారు.

పోటీల్లో అధికారుల సత్తా ..

రాష్ట్ర స్థాయి రెండో పోలీస్ డ్యూటీ మీట్–2025లో ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ అందుకుంది. సైంటిఫిక్ ఎయిడ్, యాంటీ సబటేజ్ చెక్, కంప్యూటర్ అవేర్‌నెస్, డాగ్ స్క్వాడ్, ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలకు సంబంధించి 25 విభాగాల్లో పోటీలు జరగగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ 4 ట్రోఫీలు, 17 పతకాలు కైవసం చేసుకుంది. ఇందులో 6 గోల్డ్ మెడల్స్, 7 సిల్వర్, 4 బ్రాంజ్ (కాంస్య) మెడల్స్ ఉన్నాయి. సైంటిఫిక్ ఎయిడ్ టు ఇన్వెస్టిగేషన్ పోటీల్లో సైబరాబాద్ కమిషనరేట్ ప్రథమ స్థానం, హైదరాబాద్ కమిషనరేట్ ద్వితీయ స్థానం, భద్రాచలం జోన్ తృతీయ స్థానం, యాంటీ సబటేజ్ చెక్‌లో ఇంటెలిజెన్స్ ప్రథమ స్థానం, సైబరాబాద్ కమిషనరేట్ ద్వితీయ స్థానం, డాగ్ స్క్వాడ్ కాంపిటిషన్‌లో సీఐడీ హైదరాబాద్ ప్రథమ స్థానం, ఇంటెలిజెన్స్ (ఐఎస్‌డబ్ల్యూ) ద్వితీయ స్థానం, బెస్ట్ డాగ్‌లో కాళేశ్వరం జోన్ ప్రథమ స్థానం, కంప్యూటర్ అవేర్‌నెస్, ఫొటోగ్రఫీ పోటీల్లో ఐటీ అండ్ సీ హైదరాబాద్ ప్రథమ స్థానం, ఇంటెలిజెన్స్ హైదరాబాద్ ద్వితీయ స్థానం, వీడియో గ్రఫీ పోటీల్లో సైబరాబాద్ కమిషనరేట్ ప్రథమ స్థానం, హైదరాబాద్ కమిషనరేట్ ద్వితీయ స్థానం సాధించి పతకాలు అందుకున్నాయి.

అతిథులకు గౌరవ వందనం ..

రాష్ట్ర స్థాయి 2వ పోలీస్ డ్యూటీ మీట్–2025 ముగింపు వేడుకల్లో 450 మంది అధికారులు, సిబ్బంది జెండాలు చేతబూని డీజీపీ జితేందర్ రెడ్డి, జైళ్ల శాఖ డీజీపీ సౌమ్య మిశ్రాకు గౌరవ వందనం సమర్పించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా పోలీసు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐడీ డీఐజీ నారాయణనాయక్, వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు సత్యశారద, స్నేహ శబరీశ్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లా ఎస్పీలు కిరణ్ ఖరే, సుధీర్ రామ్‌నాథ్ కేకన్, పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ, టీజీ ఎన్పీడీజీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, బల్దియా కమిషనర్‌చాహత్ బాజ్‌పాయ్, డీసీపీలు, అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో భాగంగా రింగ్ నుంచి దూకుతున్న పోలీస్ డాగ్



సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నృత్యం చేస్తున్న కళాకారులు

జ్వరంతో చిన్నారి మృతి



మాన్య(ఫైల్)

నర్సంపేట: జ్వరంతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన చెన్నారావుపేటలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బట్టి సంతోష్, సరిత దంపతుల కూతురు మాన్య(2) వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. దీంతో కుటుంబీకులు చిన్నారిని నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాయి. శనివారం పరిస్థితి విషమంగా ఉండడంతో మళ్లీ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు చిన్నారి మృతదేహం మీద పడి గుండెలవిసేలా రోదించారు.

ఇసుక లారీ యజమానులపై కేసు నమోదు

వరంగల్ క్రైం: నిబంధనలకు విరుద్ధంగా హనుమకొండ కేఎల్ ఎన్‌రెడ్డి కాలనీలోని ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన నిర్వహించిన ఇసుక లారీ యజమానులపై కేసు నమోదు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ ఎం.రంజిత్‌కుమార్ తెలిపారు. జూలై 31న దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మైనింగ్, ఆర్‌టీఏ, రాష్ట్ర పన్నుల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి ఓవర్ లోడ్ ఉన్న లారీలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. దీనికి నిరసనగా లారీ యజమానులు విజిలెన్స్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడంతో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఇసుక లారీల యాజమాన్యం అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయుడితో పాటు మరో 20 మందిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వరంగల్ జిల్లాలో 'మిషన్ తేజస్'

● మిషన్ రూపకర్త వరంగల్ కుర్రాడు గుండు అనిరుధ్



గుండు అనిరుధ్

విద్యారణ్యపురి: సమగ్రశిక్ష తెలంగాణ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్ నికోలస్ అనుమతితో వరంగల్ జిల్లాకు చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి గుండు అనిరుధ్ ఆధ్వర్యంలో మిషన్ తేజస్ (తెలంగాణ జ్ఞాన ఆవిష్కరణ సంకలనం) నూతన ఆవిష్కరణ కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించి ఆ స్కూళ్లను స్మార్ట్ ఇన్నోవేషన్‌గా మార్చేందుకు దోహదపడుతుంది. ప్రభుత్వానికి లేదా పాఠశాల విద్యాశాఖకు ఎలాంటి ఆర్థిక బాధ్యత ఉండొద్దనే నిబంధనతో ఈ కార్యక్రమానికి అనుమతినిస్తూ సమగ్రశిక్ష రాష్ట్ర డైరెక్టర్ అనుమతి ఇచ్చారు. ఈ మేరకు ఆ ప్రాజెక్టు అడిషనల్ డైరెక్టర్ ఎం. రాధారెడ్డి ఈనెల 1న ప్రొసీడింగ్ జారీ చేశారు. ఈ మిషన్ ప్రారంభదశలో వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారికి జిల్లాలోని 10 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి అమలు చేయాలని పేర్కొన్నారు. సంబంధిత ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రతీ విద్యార్థి భద్రత,సైబర్ భద్రతాపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఆమోదం లభించింది. శనివారం అనిరుధ్ తన తండ్రితో కలిసి వరంగల్ జిల్లా డీఈఓ మామిడాల జ్ఞానేశ్వర్‌ను కలిశారు. త్వరలోనే 10 ప్రభుత్వ పాఠశాలలను ఎంపికచేసే అవకాశం ఉంది.